E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాల వారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: TELANGANA    సంపుటి :01    సంచిక :147    మంగళవారం, 05 మే 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

## ప్రభుత్వ భూములు కాపాడాలంటూ వినతులు



**హైదరాబాద్, మే 04 (తెలుగు గళం):** ప్రభుత్వ భూములు కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణికి విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమికి సంబంధించి గజం స్థలం కబ్జా అవుతున్నా నగర ప్రజలు ఊరుకోడంలేదు. గతంలో మనకెందుకులే అనుకునేవాళ్లమని.. ఇప్పుడు హైడ్రాకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారనే నమ్మకంతో తామంతా వచ్చి ఫిర్యాదు చేస్తున్నామని పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో హైడ్రా చూపుతున్న చొరవను చూసి తాము ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టకుండా ఆక్రమణలు తొలగించడాన్ని అభినందిస్తూనే మా ప్రాంతాల్లో కూడా చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులు, నాలాల ఆక్రమణలకు గురౌతున్నాయని.. వాటిని కాపాడాలని పలువురు హైడ్రాను విజ్ఞప్తి చేశారు.

## చిన్నారుల భవిష్యత్తుకు భరోసానివ్వడం మనందరి బాధ్యత: సైబరాబాద్ సీపీ

**లింగంపల్లి (తెలుగు గళం):** నార్సింగిలోని రాజపుష్ప లేబర్ క్యాంప్‌లో వలస కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక 'వర్క్ సైట్ స్కూల్'ను సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మరియు సీఎంసీ కమిషనర్ సృజన కలిసి ప్రారంభించారు. తెలంగాణ విద్యాశాఖ, మున్సిపల్ శాఖ మరియు రాజపుష్ప ప్రాపర్టీస్ సంయుక్త భాగస్వామ్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వివిధ రాష్ట్రాల నుండి బతుకుదెరువు కోసం వచ్చిన కార్మికుల పిల్లలకు రక్షణతో కూడిన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ఈ పాఠశాల ప్రధాన ఉద్దేశ్యం. ఈ విద్యా కేంద్రం ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భవిష్యత్తు లభించనుంది.

ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ,, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో వలస కార్మికుల శ్రమ ఎంతో ఉందని, వారికి రక్షణ కల్పించి భరోసానివ్వాల్సిన బాధ్యత మనపై ఉందని డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. సర్వ శిక్ష అభియాన్ మరియు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ శాఖలైన జిహెచ్ఎంసి, రెవెన్యూ, లేబర్ డిపార్ట్మెంట్‌లతో పాటు ప్రైవేట్ సంస్థలు, ఎన్జీవోలు మరియు డెవలపర్లు సమిష్టిగా పనిచేస్తేనే అద్భుతమైన ఫలితాలు వస్తాయని తెలిపారు. చిన్నారులు ఈ దేశానికి ఆస్తి అని, వారిలో మంచి విలువలు నింపి, గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని ఆయన ఆకాంక్షించారు. ఈ దిశగా ముందుకొచ్చిన రాజపుష్ప ప్రాపర్టీస్ వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.





# పంచ పాలకులు..

- అస్సాంలో ఎన్డీఏ కూటమి చారిత్రక హ్యాట్రిక్ విజయం.
- తమిళనాడులో విజయ్ నాయకత్వంలోనే టీవీకే అతి పెద్ద పార్టీ
- కేరళలో యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఘనవిజయం.
- పశ్చిమ బెంగాల్‌లో సూపర్ విక్టరీ సాధించిన తృణమూల్ కాంగ్రెస్
- పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి మరోసారి ఆధిక్యత

బెంగాల్ - BJP 206 / 294

తమిళనాడు-TVK 107 / 234

అస్సాం - BJP 82 /126

కేరళ - INC 63/140

పుదుచ్చేరి - AINRC 12/30



హిమంత బిశ్వ శర్మ
అసోం ముఖ్యమంత్రి అభ్యర్థి



సతీసన్
కేరళ సీఎం అభ్యర్థి



సువేందు అధికారి
బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి



ఎన్. రంగస్వామి
పుదుచ్చేరి సీఎం అభ్యర్థి

**అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం మరియు పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4, 2026న ఏకధాటిగా జరిగి, తుది ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికలు ప్రధాన ప్రాంతీయ మరియు జాతీయ పార్టీలకు, ముఖ్యంగా కొత్తగా అడుగుపెట్టిన నాయకులకు పెద్ద పరీక్షగా నిలిచాయి. పలు రాష్ట్రాల్లో అధికార మార్పులు చోటుచేసుకోగా, కొన్ని చోట్ల మాత్రం పాత ప్రభుత్వాలు తమ పట్టును నిలుపుకున్నాయి.**

*1. అస్సాంలో బీజేపీ హ్యాట్రిక్: అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు*

అస్సాం అసెంబ్లీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ (BJP) నేతృత్వంలోని ఎన్డీయే కూటమి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించడం ద్వారా ఈశాన్య భారతదేశంలో తమ పట్టును మరింత పటిష్టం చేసుకుంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వం ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది. జాలుక్బరి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించిన ఆయన, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషికి ప్రజలు పట్టం కట్టారు.

ఈ గెలుపునకు ప్రధాన కారణం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు మౌలిక వసతుల అభివృద్ధి. గత కొన్ని సంవత్సరాలుగా అస్సాంలో దశాబ్దాల తరహా హింసాత్మక ఘటనలకు తెరపడటం, ఈశాన్య ప్రాంతాన్ని అనుసంధానించే ప్రాజెక్టులు వేగవంతం కావడం ప్రజలను ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా, మహిళలకు, యువతకు అందించిన సంక్షేమ పథకాలు, డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పనితీరుపై నమ్మకం ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది.

అస్సాంలో కాంగ్రెస్ పార్టీ సరైన నాయకత్వ లేమితో మరియు అంతర్గత విభేదాలతో సతమతమవడం బీజేపీకి కలిసొచ్చింది. స్థానిక సమస్యలను సమర్థవంతంగా లేవనెత్తడంలో ప్రతిపక్షాలు విఫలం కాగా, బీజేపీ స్థానిక అస్సామీ గుర్తింపును పరిరక్షిస్తూనే, జాతీయ విధానాలను సమర్థవంతంగా అమలు చేసింది. దీంతో భవిష్యత్తులోనూ అస్సాంలో బీజేపీకి బలమైన పునాది ఏర్పడింది.

*2. తమిళనాడులో సంచలనం: 'తమిళగ వెట్రి కజగం' అరంగేట్రంలోనే విజయం*

తమిళనాడు రాజకీయ చరిత్రలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కజగం' (TVK) పార్టీ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగి ఏకంగా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి గండికొడుతూ, రాష్ట్రంలో కొత్త రాజకీయ శకానికి నాంది పలికింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ సొంత నియోజకవర్గంలోనే ఓటమి పాలవ్వడం డీఎంకేకి ఊహించని ఎదురుదెబ్బ.

డీఎంకే ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏర్పడిన ప్రజావ్యతిరేకత ఈ ఫలితాలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ధరల పెరుగుదల, అవినీతి ఆరోపణలు, మరియు కొన్ని సంక్షేమ పథకాల అమలులోని లోపాలు ప్రజలను నిరాశపరిచాయి. యువత మరియు కొత్త తరం ఓటర్లు మార్పును కోరుకోవడం, దానికి అనుగుణంగా విజయ్ ప్రవేశపెట్టిన ప్రత్యామ్నాయ రాజకీయాలు యువతను అమితంగా ఆకర్షించాయి.

టీవీకే పార్టీ అవినీతికి వ్యతిరేకంగా, తమిళనాడు సంస్కృతి పరిరక్షణ మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యాలుగా చేసిన ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లింది.

## తయారీలో నాణ్యత పాటించండి

- క్లస్టర్లపై సమీక్ష నిర్వహించిన చంద్రబాబు నాయుడు



**అమరావతి,మే 4(తెలుగు గళం):** విశాఖ ఎకనమిక్ రీజియన్, అమరావతి ఎకనమిక్ రీజియన్, తిరుపతి ఎకనమిక్ రీజియన్ ప్రాంతాల్లోని పారిశ్రామిక క్లస్టర్ల పై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం( భవ్య పథకం) కింద పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపైనా వివరాలు తెలుసుకున్నారు.

## గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు నాణ్యతగా ఉండాలి

- పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ
- రవాణా వ్యయం తగ్గించటమే కీలకమైన అంశం
- ఇండస్ట్రీ- ఇన్ఫ్రా- టూరిజం అంశాలపై ప్రత్యేక దృష్టి
- ఏపీలో ప్రాడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష

**అమరావతి, మే 04(తెలుగు గళం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్లుగా ఎదిగేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో సోమవారం ప్రాడెక్టు పర్ఫెక్షన్ క్లస్టర్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా విశాఖ ఎకనామిక్ రీజియన్, అమరావతి ఎకనామిక్ రీజియన్, తిరుపతి ఎకనామిక్ రీజియన్ ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్లపై చర్చించారు.



## శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ తో విద్యాశాఖ ఎంవోయూ



**ఉండవల్లి , మే 4(తెలుగు గళం):** ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులతో ఎక్కువమంది భోజనం చేస్తున్నారు. భోజనం మరింత రుచి, శుచిగా వడ్డించేలా విద్య, ఐటీ శాఖల మంత్రిగా నారా లోకేష్ ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే నిమిత్తం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో ప్రస్తుతం అమలులో ఉన్న రాగిజావ పంపిణీ కార్యక్రమం మరో మూడేళ్లు కొనసాగింపునకు ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# పంచ పాలకులు..

మొదటి పేజీ తరువాయి

సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను నేరుగా స్పృశించడం వల్ల ఈ పార్టీకి అన్ని వర్గాల మద్దతు లభించింది. రాబోయే కాలంలో తమిళనాడు రాజకీయాలు పూర్తిగా ఈ కొత్త సమీకరణాల చుట్టూ తిరిగే అవకాశం ఉంది.

3. కేరళలో యూడీఎఫ్ ప్రభంజనం: వామపక్ష కూటమికి ఎదురుదెబ్బ

కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (UDF) తిరుగులేని విజయాన్ని సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. గత ఎన్నికల్లో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (LDF) కూటమి ఘోర పరాజయం పాలవడంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన పదవికి రాజీనామా చేశారు. ఖణఖీ కూటమి దాదాపు వందకు పైగా స్థానాలను కైవసం చేసుకోవడం కేరళ రాజకీయాల్లో ఒక సంచలనం.

కేరళలో ఎల్డీఎఫ్ ఓటమికి ప్రధాన కారణాలు ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం మరియు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు. ముఖ్యంగా కేరళలో కే-రైల్ వంటి వివాదాస్పద ప్రాజెక్టులపై ప్రజల్లో వ్యతిరేకత, అలాగే వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ సహాయక చర్యల్లో జాప్యం వంటి అంశాలు ఓటర్లపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. మైనారిటీ ఓట్లు యూడీఎఫ్ వైపు మళ్లడం కూడా ఈ భారీ మెజారిటీకి కారణమైంది.

మరోవైపు, బీజేపీ కేరళలో కూడా తన ఉనికిని చాటుకుంటూ మూడు స్థానాలను గెలుచుకోవడం గమనార్హం. జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని, కేరళలో అభివృద్ధి కోసం అవసరమైన మార్పులను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పవచ్చు. ఖణఖీ కూటమి ఐక్యత మరియు సమర్థవంతమైన ప్రచారం ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయి.

3. బెంగాల్ లో మమతా బెనర్జీ కంచుకోటకు బీటలు

పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దాల పాటు తిరుగులేని శక్తిగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (TMC) పార్టీకి ఈ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక ఎదురుదెబ్బ తగిలింది. భారతీయ జనతా పార్టీ (BJP) రాష్ట్రంలో అఖండ విజయం సాధించి, స్పష్టమైన మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీని ఓడించి, బీజేపీ ఈ ప్రాంతంలో పాగా వేయడం అనేది తూర్పు భారతదేశ రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా చెప్పవచ్చు. ఈ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలోనూ, అలాగే రాష్ట్రంలోనూ ఒక బలమైన పునాదిని ఏర్పరచింది.

ఈ ఘన విజయం వెనుక క్షేత్రస్థాయిలో అనేక కారణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న శాంతిభద్రతల సమస్యలు, అవినీతి ఆరోపణలు మరియు ప్రభుత్వ వ్యతిరేకత బీజేపీకి బాగా కలిసివచ్చాయి. ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలు మార్పును కోరుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మహిళల భద్రత, మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ఇచ్చిన ప్రాధాన్యత ఓటర్లను ఆకట్టుకున్నాయి. అలాగే, బీజేపీ నాయకత్వం చేపట్టిన విస్తృత ప్రచారం, స్థానిక సమస్యలను సమర్థవంతంగా లేవనెత్తడం టీఎంసీ ఓటు బ్యాంకుకు గండికొట్టాయి.

బెంగాల్‌లో బీజేపీ గెలుపు కేవలం ఒక సాధారణ ఎన్నికల ఫలితం కాదు, ఇది జాతీయ రాజకీయాల్లో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. తూర్పు భారతదేశంలో అతిపెద్ద రాష్ట్రమైన బెంగాల్‌లో పాగా వేయడం ద్వారా, బీజేపీ దేశవ్యాప్తంగా తన విస్తరణ వ్యూహాన్ని మరోసారి నిరూపించుకుంది. భవిష్యత్తులో బెంగాల్ రాజకీయాల్లో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, రానున్న కాలంలో జాతీయ రాజకీయాల దిశను మార్చే శక్తిగా ఈ విజయం నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

5. పుదుచ్చేరిలో ఎన్. రంగసామి నాయకత్వానికి జై

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో మరోసారి ఎన్డీఏ కూటమి తన ఆధిక్యాన్ని నిలుపుకుంది. అనుభవజ్ఞుడైన నాయకుడు ఎన్. రంగసామి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల తీర్పు స్థిరమైన మరియు అభివృద్ధి ఆధారిత పాలనకు ప్రజలు ఇచ్చిన పట్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రంగసామి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలు మరియు కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు ఈ విజయానికి దోహదపడ్డాయి. చిన్న రాష్ట్రమైన పుదుచ్చేరిలో మౌలిక వసతుల కల్పన, పర్యాటకరంగ అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం ప్రజలను ఆకట్టుకుంది. ప్రతిపక్షాల మధ్య సరైన సమన్వయం లేకపోవడం కూడా ఎన్డీఏకు కలిసొచ్చింది. ఈ ఫలితాలు పుదుచ్చేరిలో స్థిరమైన ప్రభుత్వానికి మరియు కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన మద్దతును సూచిస్తున్నాయి. రాబోయే ఐదు సంవత్సరాలలో పుదుచ్చేరి మరింత అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

మొత్తం మీద, ఈ 2026 ఎన్నికల ఫలితాలు పాలన, అభివృద్ధి మరియు నాయకత్వంపై ప్రజల స్పష్టమైన తీర్పును ప్రతిబింబిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలతో పాటు జాతీయ పార్టీల కూర్పులు మారడంతో, రాబోయే రోజుల్లో దేశ రాజకీయాలు మరింత చైతన్యవంతంగా మారే అవకాశం ఉంది.

## ప్రభుత్వ భూములు కాపాడాలంటూ వినతులు

మొదటి పేజీ తరువాయి

రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి విలేజ్‌లోని 100 అడుగుల రహదారికి ఆనుకుని రెండు రోడ్డులు కలిసే చోట ఉన్న ప్రభుత్వ భూమిలో రేకుల ప్రహరీ వేసి లోపల నిర్మాణాలు చేపడుతున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే మార్గంలో నాలాలపై నిర్మాణాలు చేపడుతున్నారని.. వర్షాకాలం వరద ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకుండా వెంటనే ఆపాలని ప్రజావాణిలో కోరారు. కీసర మండలంలోని నాగారం విలేజ్‌లో సర్వే నంబరు 291/3లఓ మొత్తం 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ మండలంలోని మల్లాపూర్ గ్రామం సర్వే నంబరు 84లో దాదాపు 2 వేల గజాల స్థలం ప్రభుత్వానిది కాగా.. ఇందులో నిర్మాణాలకు సిద్ధమౌతున్నారని వెంటనే కాపాడాలని కోరారు. కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఆలయాల పేరిట వ్యాపార సముదాయాలు నిర్మించి అద్దెలు ఇచ్చి రూ. లక్షలు కాజేస్తున్నారని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కీసర మండలం నాగారం విలేజ్‌లోని సర్వే నంబరు 83లో 18 ఎకరాల మేర ఉన్న పాత లేఔట్‌ను చెరిపేసి 80 గజాల చొప్పున నోటరీమీద స్థలాలు అమ్ముకుంటున్నారని.. పాత లే ఔట్ ప్రకారం పార్కులు, రహదారులు కాపాడాలని ప్లాట్ల యజమానులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగిపేట గ్రామంలో మల్లప్పగారి కుంట దాదాపు 14 ఎకరాలుంటుందని.. మొత్తం చెరువు స్వరూపాన్ని మార్చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో స్థానికులు పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేటలోని కుంట్లూరు విలేజ్లో ప్రజయ్ గుల్‌మహర్ కాలనీ గేటెడ్ కమ్యూనిటీ కాకపోయినా రహదారులకు అడ్డంగా ప్రహరీలు నిర్మించి పక్కనే ఉన్న కాలనీలకు దారి లేకుండా చేస్తున్నారని అక్కడి స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు పరిశీలించారు. వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## తయారీలో నాణ్యత పాటించండి

మొదటి పేజీ తరువాయి

2026–27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశాల పైన కూలంకషంగా వివరాలు సేకరించారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్లోబల్ బ్రాండ్లుగా స్థానిక ఉత్పత్తులు నాణ్యతగా ఉండాలి.

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం( భవ్య పథకం) కింద చేపట్టనున్న పారిశ్రామిక పార్కులు, కెమికల్ పార్కుల అభివృద్ధి పై సీఎం చర్చించారు. 2026–27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్క్ ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్, కంటైనర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ సహా 175 ఎంఎస్ఎంఈ పార్కులను క్లస్టర్ల వారీగా అభివృద్ధి చేసే అంశంపై సమీక్షలో చర్చించారు. పారిశ్రామిక పార్కుల్లో ప్రాడెక్టు పర్ఫెక్షన్ తో పాటు లాజిస్టిక్స్ ను కూడా అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. నీరు, విద్యుత్, కోల్డ్ చైన్, వేర్ హౌసింగ్ లాంటి మౌలిక సదుపాయాలు ఈ లాజిస్టిక్స్ పార్కులకు అనుసంధానమయ్యేలా చూడాలన్నారు. ప్రత్యేకించి రవాణా వ్యయం తగ్గితే ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామిక క్లస్టర్లకు రైల్, రోడ్, పోర్టు కనెక్టివిటీ జరిగేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ జరగాలని సూచనలు చేశారు.

### ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధి

స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు నాణ్యత పెరిగితేనే గ్లోబల్ స్థాయికి చేరుతాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉత్పత్తులకు స్థానికంగా, ప్రాంతీయంగా, దేశ, విదేశీ మార్కెట్లకు చేరేలా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంఎస్ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారయ్యేలా ప్రోత్సాహం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రోడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయటం ద్వారా రైతులకూ ప్రయోజనం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన భవ్య పథకం ద్వారా రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో రసాయనాల తయారీ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమలు– మౌలిక సదుపాయాలు– పర్యాటకం అనే విధానంలో ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ప్రతీ జిల్లాలోనూ ఓ మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున కలుగుతాయన్నారు. ప్రతీ పారిశ్రామిక క్లస్టర్ వద్దా ఇండస్ట్రియల్ టౌన్ షిప్ ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా ఏపీ ఎంఎస్ఎంఈల స్థాపనలో అగ్రస్థానంలో ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్మెంట్ జరగాలన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల్లోనూ కోర్సులను హైబ్రీడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలన్నారు. సమీక్షకు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాలు, అటవీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆర్టీజీఎస్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు

## చిన్నారుల భవిష్యత్తుకు భరోసానివ్వడం మనందరి బాధ్యత: సైబరాబాద్ సీపీ

మొదటి పేజీ తరువాయి



సీఎంసీ కమిషనర్ సృజన మాట్లాడుతూ,, హైదరాబాద్ నగరాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపే క్రమంలో కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనే కాకుండా, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌ను కూడా ఒక బాధ్యతగా తీసుకుంటామని సీఎంసీ కమిషనర్ సృజన తెలిపారు. బతుకుతెరువు కోసం వలస వచ్చిన కార్మికుల పిల్లలకు కనీస హక్కులు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేసిన సైబరాబాద్ సీపీ ని ఆమె అభినందించారు. ఈ పిల్లలకు విలాసవంతమైన జీవితం ఇవ్వలేకపోయినా, ఒక మంచి వాతావరణాన్ని, భద్రతను కల్పించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ వర్క్ సైట్ స్కూల్ కార్యక్రమం ఒక రోజుకు పరిమితం కాకుండా, ఒక శాశ్వత వ్యవస్థలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఇందుకోసం సీఎంసీ తరపున కేర్ టేకర్లను ఏర్పాటు చేయడంతో పాటు, పిల్లల వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. వలస కార్మికుల పిల్లలు సురక్షితమైన ప్రదేశంలో పెరుగుతూ, సమాజంపై నమ్మకంతో గొప్ప పౌరులుగా ఎదగాలని, ఈ దిశగా పోలీస్ శాఖతో కలిసి సైబరాబాద్ మున్సిపాలిటీ పూర్తిస్థాయిలో పనిచేస్తుందని కమిషనర్ సృజన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, కూకట్‌పల్లి ఏడీసీపీ సుదర్శన్, రాజ పుష్ప ఎండి మహేందర్ రెడ్డి, నార్సింగి ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో ఈదులకుంట చెరువు కబ్జా ఆరోపణలు

### భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి

**శేరిలింగంపల్లి, మే 4: (తెలుగు గళం):** శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామ పరిధిలోని ఈదులకుంట చెరువు కబ్జాకు గురవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 7లో ఉన్న సుమారు 6.05 ఎకరాల చెరువు స్థలాన్ని కొంతమంది రియల్ ఎస్టేట్ సంస్థలు ఆక్రమించి, సెల్లార్ తవ్వకాల పనులు చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు.

స్థానికుల వివరాల ప్రకారం, ఒక బడా ప్రైవేటు సంస్థ చెరువు భూమిని కూకట్‌పల్లి సర్వే నెంబర్ల పేరుతో తమ ఆధీనంలోకి తీసుకొని వేగంగా తవ్వకాల పనులు నిర్వహిస్తోంది. మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లోనే ఆ ప్రదేశంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం ప్రారంభమయ్యే పరిస్థితి ఉందని వారు చెబుతున్నారు.

ఇప్పటికే ఈ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా సందర్శించి, ఇది ఈదులకుంట చెరువేనని ప్రకటించినట్లు సమాచారం. రెవెన్యూ అధికారులు కూడా ఖానామెట్ సర్వే నెంబర్ 7లోని భూమి ప్రభుత్వానికి చెందిందని, అది చెరువుగా నమోదై ఉందని రాతపూర్వకంగా వెల్లడించారు.




హైడ్రా ఏర్పాటు తర్వాత కూడా చెరువును కబ్జా నుంచి కాపాడాలని స్థానికులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై స్పందించిన కమిషనర్ రంగనాథ్ మూడు సార్లు ప్రదేశాన్ని పరిశీలించి, చెరువు హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. చెరువు చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ను కూడా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించినప్పటికీ, ప్రస్తుతం భారీ యంత్రాలతో తవ్వకాలు కొనసాగుతున్నాయి.

ఈ నేపథ్యంలో చెరువును పూర్తిగా నాశనం చేసే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈదులకుంట చెరువును పరిరక్షించాలని డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్‌లను ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ తో విద్యాశాఖ ఎంవోయూ

మొదటి పేజీ తరువాయి



ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో 2026–29 కాలానికి విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమం కొనసాగించేందుకు శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభం కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ తో కాలపరిమితి ముగిసింది. దీంతో పొడిగింపునకు విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.

ప్రస్తుతం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో జోనల్ వారీగా విద్యార్థులకు మెనూ అమలుచేస్తున్నారు. ఈ మెనూలో ఫోర్టిఫైడ్ ఫైన్ రైస్, వారానికి 5 సార్లు గుడ్డు, వారానికి మూడు సార్లు చిక్కీ, అలాగే పోషకాహారపు పదార్థంలుగా చిక్కీలేని రోజుల్లో రాగిజావను వారానికి మూడు సార్లు అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం ఏడాదికి సుమారు 1,850 కోట్లు ఖర్చుచేస్తోంది. తద్వారా విద్యార్థుల ఎన్ రోల్ మెంట్, అటెండెన్స్, డ్రాప్ అవుట్స్ నివారణ, పోషకస్థాయిలు మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకుంది.

విద్యార్థులకు హెల్త్ సప్లిమెంట్ గా రాగిజావను పంపిణీ చేస్తున్నారు. 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పొడిని 150 మిల్లీలీటర్ల వేడినీటిలో కలిపి విద్యార్థులకు అందించడం జరుగుతోంది. తద్వారా కాల్షియం, ఐరన్ తో సమృద్ధిగా ఉండి పోషకాహారాన్ని మెరుగుపరుస్తుంది. రాగిపిండి, బెల్లంపొడిని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఉచితంగా అందిస్తుంది. ట్రస్ట్ ద్వారా జిల్లా కేంద్రాల వరకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ ద్వారా పాఠశాలలకు పంపిణీ చేస్తారు. ఇందుకోసం మూడేళ్లలో రూ.80 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అడ్మిన్ కోఆర్డినేటర్ ఎస్.జి చలం, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావుతో పాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అడిషనల్ డైరెక్టర్ ఆర్.ఎస్ గంగా భవాని తదితరులు పాల్గొన్నారు.

## రాజముద్రతో అందిస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలను సద్వినియోగం చేసుకోండి.

### తహసిల్దార్ శంకరరావు.



**చింతపల్లి తెలుగు గళం న్యూస్:-** రాష్ట్ర ప్రభుత్వం రాజముద్రతో అందజేస్తున్న పట్టాదారు పాసు పుస్తకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శంకరరావు అన్నారు. మండలంలోని బెన్నవరం పంచాయతీ వట్టి బూసుల గ్రామంలో ఆ పంచాయతీ వీఆర్వో రమణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా తహసిల్దార్ శంకరరావు, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ బాలరాజు దొర లు విచ్చేశారు. వారికి ఆ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు గెమ్మెల సోనీ, లతోపాటు గ్రామస్తులు పుష్పగుచ్చాలు అందించి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శంకర రావు మాట్లాడుతూ తర తరాలుగా తాతలు, తండ్రుల పేరున మాత్రమే ఉన్న భూములను మ్యూటేషన్ విధానం ద్వారా వారి సంతానానికి చెందే విధంగా ఆలోచన చేసిందన్నారు. తదనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు మ్యూటేషన్ విధానం ద్వారా రాజముద్రతో పట్టా దారు పాసు పుస్తకాలను తయారు చేయడం జరిగిందని, తాతలు, తండ్రుల ద్వారా సంక్రమించిన భూ పట్టాదారు పాసు పుస్తకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ సందర్భంగా వట్టి భూసుల గ్రామంలో అర్హత కలిగిన 59 మంది ఖాతాదారులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సోనీ, చింతపల్లి మండల జనసేన పార్టీ మండల కోఆర్డినేటర్ వంతల రాజబాబు, బిజెపి మండల ఉపాధ్యక్షుడు మర్రి సాంబశివ మూర్తి, రాంబాబు, వైకాపా నాయకుడు గెమ్మెల రమణ, గేదెల విజయ్ కుమార్, భీమలింగం, కుర్ర బొంజు బాబు, వంతల పరమేశ్వర రావు, ముచ్చల నాగేశ్వరరావు, వంతల నూకరాజు, అప్పన్న, పట్టాదారు పాసు పుస్తకాల లబ్ధిదారులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**శేరిలింగంపల్లి, మే 4: (తెలుగు గళం):** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం సోమవారం అగ్నిప్రమాదానికి గురైంది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, కమిషనర్ చాంబర్‌లో ఉన్న ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది.

అధికారుల వివరాల ప్రకారం... కార్యాలయం వెనుక భాగంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో స్పార్క్ ఏర్పడి, అక్కడి చెట్లకు మంటలు అంటుకున్నాయి. ఆ మంటలు విద్యుత్ తీగల ద్వారా వ్యాపించి జోనల్ కార్యాలయం వరకు చేరుకున్నట్లు సిఎంసి సిబ్బంది తెలిపారు.

మంటలు వేగంగా వ్యాపించడంతో కమిషనర్ చాంబర్‌లోని ఫర్నిచర్, పత్రాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. అయితే ఆస్తి నష్టం గణనీయంగా జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. నష్టం మొత్తం అంచనా ప్రక్రియ కొనసాగుతోంది.



# వరంగల్‌లో నకిలీ నోట్ల గ్యాంగ్ బట్టబయలు -- 8 మంది అరెస్టు










**తెలుగు గళం న్యూస్ వరంగల్, మే 4**

వరంగల్ జిల్లాలో నకిలీ నోట్లను తయారుచేసి మార్కెట్లో చలామణి చేస్తున్న గ్యాంగ్‌ను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మొత్తం ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్ మరియు నర్సంపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి నకిలీ కరెన్సీతో పాటు అసలు రూ.1,48,000 నగదు, సుమారు రూ.28 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, 13 సెల్‌ఫోన్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, నర్సంపేటకు చెందిన ముగ్గురు నిందితులు అసలు రూ.100 నోట్లను ఆధారంగా తీసుకుని ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్ల సహాయంతో కలర్ ప్రింట్ తీసి నకిలీ నోట్లను తయారు చేసి మార్కెట్లో చలామణి చేస్తున్నారు.మరో ఐదుగురు నిందితులు "తక్కువ డబ్బులకు ఎక్కువ డబ్బులు (1:3 నిష్పత్తిలో)" తయారు చేసి ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు.ఈ మోసంలో భాగంగా, అసలు రూ.500 నోట్లను అయోడిన్ ద్రావణంలో ముంచి నల్లగా మార్చి, ఆపై 'హైపో' (సోడియం థయోసల్ఫేట్) ద్రావణంలో ముంచితే మళ్లీ అసలు రూపం వస్తుందని నమ్మబలికేవారు. అదే విధంగా నల్ల కాగితాలను కట్టలుగా ఇచ్చి అవి నిజమైన నోట్లుగా మారుతాయని చెప్పి బాధితుల నుంచి అసలు నగదు దోచుకుని పరారయ్యేవారు.ఇదే తరహాలో గతంలో ఘన్‌పూర్ (ములుగు), మోండా మార్కెట్ (సికింద్రాబాద్), వేంసూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో కూడా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.ఇటీవల హైదరాబాద్‌లోని చత్రినాక, నర్సంపేట ప్రాంతాల్లో కూడా మోసాలు చేసినట్లు విచారణలో వెల్లడైంది.నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు బాబులాల్, శ్రీనివాస్, ఏఎఓ సల్మాన్ పాషా మరియు సిబ్బందిని సీపీ అభినందించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# వరంగల్‌లో ట్రస్మా (వడుప్సా) జిల్లా నూతన కమిటీ ఎన్నిక




**తెలుగు గళం న్యూస్ వరంగల్ మే04**

వరంగల్ జిల్లా రంగసాయిపేటలోని విస్డమ్ హైస్కూల్‌లో ట్రస్మా (వడుప్సా) జిల్లా సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించి, కొత్త జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.ఈ ఎన్నికల ప్రక్రియకు ట్రస్మా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి కన్వీనర్లుగా వ్యవహరించగా, రాష్ట్ర కార్యదర్శి ఎన్. రమేష్ రావు ఎన్నికల అబ్జర్వర్‌గా పాల్గొన్నారు.బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా చల్ల నాగార్జున రెడ్డి (విద్యోదయ హైస్కూల్, నెక్కొండ), కార్యదర్శిగా భాషెట్టి వెంకటేశ్వర్లు (సన్‌రైస్ గ్రామర్ హైస్కూల్, వరంగల్), కోశాధికారిగా ఎం. వెంకటేశ్వర్లు (శ్రీరత్న టెక్నో స్కూల్, మొంద్రాయి, సంగెం) ఎన్నికయ్యారు.ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులతో ఎన్నికల కమిషన్ ప్రమాణ స్వీకారం చేయించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులతో పాటు జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.తమను విశ్వసించి గెలిపించిన ప్రతి పాఠశాల కరస్పాండెంట్‌కు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నూతన కమిటీ సభ్యులు సభాముఖంగా పేర్కొన్నారు.

# స్టేషన్ ఘనపూర్‌లో రైతులకు అవగాహన కార్యక్రమం







**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, మే 4**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనపూర్ రైతువేదికలో సోమవారం ఉదయం 10.30 గంటలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యత, మట్టి నమూనాల సేకరణ విధానం, సమతుల్య ఎరువుల వినియోగం వంటి అంశాలపై వివరించారు.ఖరీఫ్ సీజన్‌కు అనుకూలమైన విత్తనాల ఎంపిక, పంటల ప్రణాళిక, ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ వినియోగం మరియు వాటి ప్రయోజనాలపై అధికారులు రైతులకు వివరించారు.కార్యక్రమంలో భాగంగా ఘనపూర్ క్లస్టర్‌కు చెందిన 10 మంది రైతులకు భూసార పరీక్ష విశ్లేషణ పత్రాలను అందజేశారు.అనంతరం డ్రోన్ ఫై డెమోను ప్రదర్శించి రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, వైస్ ఛైర్పర్సన్ నీలా రాజమ్మ, డిప్యూటీ తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి చంద్రన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి సనా మహవీన్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు ఉచిత ఆటో సేవ"



**వైరా,మే04(తెలుగుగళం న్యూస్):** వైరా మండలం సిరిపురం కేజీ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు ఉచితంగా ఆటో సేవ అందిస్తూ లతీఫ్ సేవా కార్యక్రమం కొనసాగిస్తున్నారు. సోమవారం నారపనేనిపల్లి గ్రామానికి చెందిన గుడిదే అరుణ అనే గర్భిణీ స్త్రీని వైద్య పరీక్షల కోసం వైరా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి, పరీక్షల అనంతరం సురక్షితంగా తిరిగి ఆమె ఇంటి వద్దకు చేర్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలు ఆసుపత్రులకు చేరుకోవడంలో ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సేవను ప్రారంభించినట్లు తెలిపారు. అవసరమైన గర్భిణీలు ఈ ఉచిత సేవను వినియోగించుకోవాలని సూచించారు.సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 9603747878.



# హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ కమిటీ పదవి ప్రకటనపై బత్తినీ ఎల్లగౌడ్ కృతజ్ఞతలు

**ధర్మసాగర్ (తెలుగు గళం) మే 4:** గత ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందిస్తున్న తనకు పార్టీ గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందని ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన బత్తినీ ఎల్లగౌడ్ తెలిపారు.హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా తనను నియమిస్తూ పార్టీ కమిటీ ప్రకటించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు ఇనిగాల వెంకటరాంరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఇప్పటివరకు పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన విధంగానే, ఇకపై కూడా పార్టీ బలోపేతానికి మరింత శ్రమిస్తానని ఎల్లగౌడ్ స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేస్తూ, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలు చేపడతానని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని, నాయకత్వం అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని బత్తినీ ఎల్లగౌడ్ తెలిపారు.

# డిజిటల్ జనగణన స్వీయ నమోదును ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రతి పౌరుడు డిజిటల్ విధానంలో జనగణన స్వీయ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో జనగణన స్వీయ నమోదుపై అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం స్వీయ నమోదు ప్రక్రియ చాలా తక్కువగా ఉందని, దీనిని వేగవంతం చేసేందుకు ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో గత నెల 26వ తేదీన ప్రారంభమైన ఈ ప్రక్రియ మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని, పాత్రికేయులు, ప్రజలు, ప్రభుత్వ ప్రభుత్వేతర కార్యాలయాల్లో పనిచేసే సిబ్బందితో పాటు సింగరేణి,జెన్కో వంటి పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న వారందరూ తప్పనిసరిగా నమోదు కావాలని ఆయన స్పష్టం చేశారు.

స్వీయ గణన నమోదు కోసం ప్రజలు [https://se.census.gov.in](https://se.census.gov.in) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి, అక్కడ వచ్చే ఐడీ నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ నమోదు మే 10తో ముగిసిన అనంతరం, మే 11 నుండి ఇంటింటికీ వచ్చే గణన అధికారికి ఈ సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీని చూపి వివరాలను అప్రూవ్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయడం వల్ల జనగణన ప్రక్రియ సులభతరం అవుతుందని, అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్కరికీ దీనిపై అవగాహన



కల్పించి వంద శాతం నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ జవహర్ అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అంత్య పుష్కరాలకు అభేద్యమైన భద్రత

- 2500 మంది పోలీసులతో పహారా--జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్






**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు జరగనున్న 'సరస్వతి అంత్య పుష్కరాలను' అత్యంత పకడ్బందీగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపిఎస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పుష్కరాల భద్రతా ఏర్పాట్లు,ట్రాఫిక్ నియంత్రణ,మౌలిక వసతుల కల్పనపై నోడల్ అధికారితో కలిసి ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.

2500 మంది పోలీసులతో భారీ బందోబస్తు

ఈ పుష్కరాల కోసం సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే పుష్కర ఘాట్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.నిరంతర నిఘా కోసం ఘాట్‌ల వెంబడి అత్యాధునిక సీసీ కెమెరాలను అమర్చి,వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

250 ఎకరాల్లో పార్కింగ్.. వన్‌వే ట్రాఫిక్ అమలు

భక్తుల వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో భారీ పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసినట్లు ఎస్పీ వివరించారు.ఇప్పటికే ఈ పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించామని,వాహనాలు సులభంగా వచ్చి వెళ్లేలా వన్‌వే ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.రహదారుల అభివృద్ధి పనులతో పాటు భక్తులకు రాకపోకలు సులభతరం చేసేలా ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం

భద్రతతో పాటు భక్తులకు అవసరమైన తాగునీరు,విద్యుత్ దీపాలు,శానిటేషన్ అత్యవసర వైద్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు."అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి కాళేశ్వరం పుష్కరాలను విజయవంతం చేయాలి.భక్తులకు భద్రతపై పూర్తి భరోసా కల్పించడమే పోలీసు యంత్రాంగం లక్ష్యం"అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్,డీఎస్పీ సూర్యనారాయణ,వివిధ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు,జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇస్లావత్ తండాలో పనిచేయని చేతి పంపులు

## ● మండుటెండలో దాహార్తితో అల్లాడుతున్న ప్రజలు





**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి /మే 4**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చేతి పంపుల మరమ్మతులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఇస్లావత్ తండా,ధరంసోత్ తండా,భూక్యా తండా,మూడు తండా,మూడు బీచార్యి తండా,మంగళి బోడు తండాలు ఉన్నాయి.ఆయా తండాల్లో రెండు,మూడు చేతి పంపులు ఉన్నప్పటికీ అవి రిపేర్‌కు నోచుకోవడం లేదు.ఓ వైపు మండుటెండలో బాటసారులు, ప్రయాణికులు తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నారు.మిషన్ భగీరథ నీరు వస్తున్నా అవి ఏమాత్రం సరిపోవడం లేదని తండా వాసులు అంటున్నారు.గత ఏప్రిల్ నుంచి ఎండలు మండుతున్నాయి.మే నెలలో కూడా చేతి పంపుల మరమ్మతులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల,ప్రయాణికుల దాహార్తిని తీర్చేవారు.అయితే ఈ సంవత్సరం మాత్రం చలివేంద్రం ఏర్పాటు చేయకపోవడం వల్ల తాగేందుకు నీరు దొరక్క వాహనదారులు,బాటసారులు గొంతెండుతున్నారు.ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి వెంటనే ఆయా తండాల్లోని చేతి పంపులను రిపేర్ చేయించాలని తండావాసులు కోరుతున్నారు.ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.అని అంటున్నారు.

# ఉప్పరపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలి

## ● కలెక్టర్‌కు ఆర్ఎస్పీ వినతి


Citizen Copy

GOVERNMENT OF TELANGANA

Warangal District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DWARG04052600064 | Grievance Date: | 04-MAY-2026 |
| Citizen Name: | Vallamdasu Kumar | Mobile No.: | 8464932717 |
| Gist of Grievance: | Requesting for take necessary action against illegal encroachment govt lands | | |

Your Grievance has been forwarded to the Warangal Dist. Panchayat Office - Warangal for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required

"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 4**

వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని ఉప్పరపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ నిర్మించాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ) వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ మాట్లాడుతూ... "ఉప్పరపల్లి ఎక్స్ రోడ్డు ఎన్ ఎచ్ -563 జాతీయ రహదారికి ముఖ్యమైన రవాణా జంక్షన్. ఈ జంక్షన్ నుండి ప్రతిరోజు తొర్రూరు, వరంగల్, ఖమ్మం వైపు ఎన్నో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఉప్పరపల్లి, గోపనపల్లి, చౌటపల్లి, నల్లబెల్లి, వడ్లకొండ, కరోలకల్, నారాయణపురం, పర్వతగిరి, కల్లెడ, అన్నారం గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి నుండి రాకపోకలు సాగిస్తున్నారు" అని తెలిపారు. బస్సులు, ఆటోల కోసం ఉప్పరపల్లి ఎక్స్ రోడ్డు మూలమలుపు వద్ద ప్రయాణికులు నిలబడి వేచి చూస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రభుత్వం మంచినీటి బోరింగును ఏర్పాటు చేసినా ప్రస్తుతం అది పనిచేయకపోవడంతో ప్రయాణికులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.అని ఆవేదన వ్యక్తం చేశారు.బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డు వెంబడి నిలబడటం వల్ల వారి కళ్ళముందే ఎన్నో ప్రమాదాలు,



యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. బస్సుల కోసం నిలుచున్న ప్రయాణికులు కూడా యాక్సిడెంట్ల వల్ల చనిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు హడావుడి చేస్తున్నారు తప్ప మిగతా సందర్భాల్లో పట్టించుకోవడం లేదు అని ఆరోపించారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రయాణికుల సౌకర్యం కోసం ఉప్పరపల్లి ఎక్స్ రోడ్డు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని వినతి పత్రంలో కోరారు

# రైతుల నోట్లో మన్ను కొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## ● వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ధ్వజం



**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 4**

వరంగల్ జిల్లా:రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇతర నాయకులతో కలిసి ఎనుమాముల మార్కెట్‌ను సందర్శించి,సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆగిపోయిన కాంటాల గురించి అధికారుల నుండి వివరాలు సేకరించి మార్కెట్‌లోని ధాన్య కుప్పలను,బస్తాలను పరిశీలించి రైతులకు సరిపడా సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.

ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ...ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ,సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైంది.దీంతో రైతులు 20 నుంచి 30 రోజులపాటు మార్కెట్ యార్డుల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.నిబంధనల పేరుతో పరిమితంగా కొనుగోళ్లు జరపడం వల్ల దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసి, మళ్లీ అధికారులతో కుమ్మక్కై అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అని ఆరోపించారు.రవాణా,హమాలీ తదితర ఖర్చుల పేరిట రైతులపై అదనపు భారం మోపుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు.రైతు డిక్లరేషన్ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం రైతులను మోసం చేసింది.రైతుల నోట్లో మన్ను కొడుతున్న కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలంటే రైతులంతా ఏకమవ్వాలి"అని పిలుపునిచ్చారు.రేపు నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై నిరసనకు మద్దతు తెలపాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జనగాంఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, వాసుదేవ రెడ్డి,రాకేష్ రెడ్డి,లలిత యాదవ్, హరి రమాదేవి,పర్వతగిరి, వర్ధన్నపేట,ఐనవోలు,హసన్ పర్తి మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీపీలు,మాజీ జడ్పీటీసీలు,మాజీ ఏఎంసీ డైరెక్టర్లు, సర్పంచులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడ్లకొండలో ఉపాధిహామీ పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ డెక్క సునీత - కుమారస్వామి



**తెలుగు గళం న్యూస్,పర్వతగిరి / మే4**

వరంగల్ జిల్లా :పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మన గ్రామ ఊర చెరువు లో పూడిక రాగడి తీయుటకు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ డెక్క సునీత - కుమారస్వామి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్లె రాజు , గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ రజిత,ఏఎన్ఎం సామ్రాజ్యం,గ్రామ ఆశ వర్కర్ వల్లందాసు లక్ష్మిపాల్గొన్నారు.

ఏఎన్ఎంసామ్రాజ్యం,గ్రామ ఆశ వర్కర్ వల్లందాసు లక్ష్మి ఉపాధి హామీ పనిచేసే కూలీలకు వైద్య ఆరోగ్య శాఖ నుండి వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించి వారికి ఓఆర్ఎస్ ద్రావణం మరియు ఫస్ట్ ఎయిడ్ కిట్టు మందులను పంపిణీ చేసినారు.ఎవరైనా వడదెబ్బకు గురైతే వారికి ప్రథమ చికిత్స ఎలా అందించాలో అవగాహన కల్పించారు. ముఖ్యంగా వృద్ధులు చిన్న పిల్లలు గర్భిణీ స్త్రీలు ఎండలో తిరగకూడదు అని అవగాహన కల్పించారు. ప్రజలు వేసవికాలంలో ఎక్కువగా ద్రవపదార్థాలు అనగా మజ్జిగ నీరు ఇంకా కొబ్బరి నీళ్ళు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై మంత్రుల అత్యున్నత స్థాయి సమీక్ష

## ● అకాల వర్షాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాల ప్రభావం ఉన్నందున జిల్లా యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, రైతులకు ఎక్కడా నష్టం కలగకుండా ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రుల బృందం ఆదేశించింది.సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకాటి శ్రీహరి పాల్గొని కొనుగోలు ప్రక్రియను సమీక్షించారు.ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే నాలుగు రోజుల పాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద తగినన్ని టార్పాలిన్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని, వర్ష సూచన ఉన్నప్పుడు ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.చిట్టచివరి రైతు నుండి కూడా ప్రతి గింజను కొనుగోలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో అధికారుల నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గత రెండు సీజన్ల కంటే ఈసారి అధికంగా ధాన్యం దిగుబడి వచ్చినందున కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను వెంటనే ఇన్చార్జ్ మంత్రుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధాన్యం రవాణాలో ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించగా,ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని, అవసరమైతే అదనపు స్టోరేజి పాయింట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దిగుమతుల్లో ఆలస్యం



జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, జిల్లాలో వరి,మొక్కజొన్న కొనుగోళ్లకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు పూర్తైన 24 గంటల్లోపే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను ముగించాలని,రైతులకు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి,పౌర సరఫరాలు,వ్యవసాయ,సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి :జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**



జిల్లాలో ధాన్యం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని,ప్రస్తుత పీక్ దశలో ఎటువంటి అంతరాయాలు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో పౌర సరఫరాలు,వ్యవసాయం,సహకార, వైద్య శాఖల అధికారులు,మిల్లర్లు మరియు ట్రాన్స్‌పోర్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 185 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 130 కేంద్రాలు ప్రారంభమయ్యాయని,మిగిలిన వాటిని కూడా తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో సుమారు 1.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, గతేడాది కంటే ఈసారి వరి సాగు పెరగడంతో దిగుబడి అధికంగా ఉందని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాట్లపై రెవెన్యూ మరియు వ్యవసాయ అధికారులతో థర్డ్ పార్టీ తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయవద్దని,రైతుల సౌకర్యార్థం టోకెన్లు జారీ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.ఐదు పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు ఇప్పటికే 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించామని, మిల్లర్లు తప్పనిసరిగా అంగీకార పత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. రానున్న నాలుగు రోజుల్లో జిల్లాలో వర్ష సూచన ఉన్నందున, ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు మరియు గన్ని సంచులను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు.ఎండ తీవ్రత, హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని,ఎవరికైనా అస్వస్థత కలిగితే తక్షణమే వైద్య సేవలు అందేలా చూడాలని వైద్య శాఖాధికారులకు సూచించారు.మండల స్థాయిలో



రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు, పంచాయతీ కార్యదర్శులకు కూడా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, డీఆర్డీఓ బాలకృష్ణ, డీపీఓ శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,రైస్ మిల్లర్లు,ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# వేంసూరు హైస్కూల్ విద్యార్థులకు సన్మానం"






**వేంసూరు,మే 4(తెలుగు గళం) న్యూస్ :** మార్చి 2026లో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ఖమ్మంజిల్లా వేంసూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఫకృద్దీన్ సత్కరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 500 పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను ఘనంగా అభినందించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, వారు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందకరమన్నారు. ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. విద్యార్థుల విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకమని పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయులు సుధాకర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణే విజయానికి కారణమన్నారు. ఇంటర్మీడియట్‌లో ఆసక్తి ఉన్న కోర్సులను ఎంపిక చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జీన్నత్ బేగం మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. కార్యక్రమం నిర్వహించినందుకు సర్పంచ్‌కు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ పరీక్షల్లో ఉమర్ ఫరూక్ 533, తేజస్వి 527, జశ్వంత్ 523, హసీనా 522, చంద్రశేఖర్ 521, రాజశేఖర్ 515, రజియా సుల్తానా 515, సనా 511, సాయి రష్మిత 510, రిజ్వానా 500 మార్కులు సాధించారు.

సర్పంచ్ ఫకృద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర రెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారావు, రవికుమార్, ఉమామహేశ్వర రెడ్డి, గ్రామ కార్యదర్శి కిషోర్ బాబు, చైర్మన్ జీన్నత్ బేగం, వార్డు సభ్యుడు యాకుబ్ నబీ, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 7న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘనపూర్ (స్టేషన్) పర్యటన

- దాదాపు రూ. 50 కోట్లతో 7 విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్న డిప్యూటీ సీఎం
- పల్లగుట్టలో 5 వేల మందితో బహిరంగ సభ ఏర్పాటు
- సభ ఏర్పాటుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలి
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సభను విజయవంతంగా నిర్వహించాలి
- ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**తెలుగు గళం న్యూస్ జనగామ మే04**

ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘనపూర్ (స్టేషన్) పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి పర్యటనపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు మాట్లాడుతూ.. ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని వేలేరు మండలం, పీచర గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని, చిల్పూర్ మండలం, కొండాపూర్ గ్రామంలో 33/11 కేవీ ఉప కేంద్రం, జఫర్గఢ్ మండలం, సాగరం గ్రామంలో 33/11 కేవీ ఉప కేంద్రం, రఘునాథపల్లి మండలం, కుర్చపల్లి గ్రామంలో 33/11 కేవీ ఉప కేంద్రాలను ప్రారంభించనున్నారన్నారు. అలాగే చిల్పూర్ మండలంలో 33/11 కేవీ లింగంపల్లి, పల్లగుట్ట, నష్కల్ ఉప కేంద్రాలకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఈ ఉప కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిప్యూటీ సీఎం పర్యటనకు సంబంధించి శిలాఫలకాల ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, సభా ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూడాలన్నారు.పలు మోడల్ స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులు, మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, సంబంధిత లబ్ధిదారులు సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా అన్ని కార్యక్రమాలు సమయపాలనతో నిర్వహించాలన్నారు.అదే విధంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పర్యటనలో భాగంగా ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో ఘనపూర్ (స్టేషన్) వెంకన్న, డీఏఓ అంబికా సోనీ, జెడ్పీ సీఈవో రంగా రావు, ఏబీసీడీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, విద్యుత్ శాఖ అధికారి సంపత్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తమ్మడపల్లి జి గ్రామంలో మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు



**తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ మే04**

జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేలా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు.సోమవారం రోజు కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి నేతృత్వంలో గ్రామంలోని ప్రతి కిరాణా దుకాణంలో అంబర్లు, పాన్ పరాకులు వంటి మత్తు పదార్థాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించి మత్తు పదార్థాలు విక్రయిస్తున్న దుకాణదారులను గుర్తించి, వారిపై రూ. 5,000 జరిమానా విధించారు.యువత భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి చర్యలు కొనసాగుతాయని, గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు తెలిపారు.గ్రామ ప్రజలు ఈ చర్యలను అభినందిస్తూ, యువతను రక్షించే ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముక్కెర గంగరాజు,లోనికి సాయిలు, ఖాసిం,గుండెబోయిన రాజు,కసిరబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ పనుల పర్యవేక్షణకు అత్యాధునిక సాంకేతికత ..!!




**విశాఖపట్నం (తెలుగు గళం) :**ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పనుల్లో పర్యవేక్షణకు అత్యాధునిక సాంకేతికత ను అందిపుచ్చుకోవాలని, అందుకు సమయం కలిసివస్తుందని, నాణ్యత మెరుగుపడుతుందని చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ సూచించారు. ఈరోజు సమావేశమందిరంలో వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ తో కలిసి ఇంజనీరింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ సిబ్బంది మరింత మెరుగైన ప్రతిభని కనపరచాలని సూచించారు. విధి నిర్వహణ లో అంకిత భావంతో పనిచేయాలని ఆదేశించారు. జూన్ 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని అనకాపల్లి కొత్తూరు దగ్గర నిర్మిస్తున్న పార్క్ ను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పార్క్ లో పచ్చదనం, క్రీడా పరికరాలు ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం వంటివి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ ., మాట్లాడుతూ ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన విస్టా టికెటింగ్ యాప్ వల్ల ఆదాయం మెరుగుపడిందని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెంట్రల్ పార్క్ ఆవరణలో నిర్మించ తలపెట్టిన యాంటి డ్రగ్ పార్క్ నిర్మాణం పై చర్చించారు. ఈ సమావేశంలో పర్యవేక్షక ఇంజినీర్ మధుసూదనరావు, ణఖీూ శ్రీమతి శిరీష, కార్యనిర్వహక ఇంజనీర్లు దుర్గాప్రసాద్, రామరాజు, సుదీర్, జీఙూ సింగ్, ఉప కార్యనిర్వహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు

# మట్టి పరీక్షలు తప్పనిసరి



- వరి పంట తరువాత పప్పు ధాన్యాలను పండించాలి
- రైతు వారోత్సవాల సందర్భంగా అవగాహన సమావేశం ఘనంగా నిర్వహణ
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తెలుగు గళం న్యూస్ జనగామ మే04**

రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రోత్సాహం, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు.సోమవారం, జనగామ మండలంలోని చౌడారం గ్రామ పంచాయతీ పరిధిలో గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు సంక్షేమ వారోత్సవాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నేల పరిరక్షణ అతి ముఖ్యమని, వరి పంట తరువాత తప్పకుండా పప్పు ధాన్యాలను పండించాలన్నారు.ప్రతి రైతు..తమ భూమిలో మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు.రైతులు తమ భూమి సారాన్ని తెలుసుకోవడానికి తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నేల ఆరోగ్య కార్డుల ద్వారా భూమిలో నత్రజని, భాస్వరం, పొటాష్ మరియు సూక్ష్మ పోషకాల స్థితిని తెలుసుకుని, అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.భూసార పరిరక్షణలో భాగంగా సేంద్రీయ ఎరువులు, పచ్చి ఎరువులు, బయో ఫర్టిలైజర్ల వినియోగాన్ని పెంచాలని రైతులకు పిలుపునిచ్చారు.నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం మీద వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.వివిధ రైతులకు మట్టి హెల్త్ కార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.అనంతరం ఏఈఓలు రాజేష్, అనిల్ రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి సాంకేతిక సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, డిప్యూటీ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ అనితా, జిల్లా ఉద్యనవన శాఖ అధికారి రమాకాంత్, చీటకోడూరు సర్పంచ్ యాదగిరి, చౌడారం ఉప సర్పంచ్ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలి

- **రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**తెలుగు గళం న్యూస్ జనగామ మే04**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.సోమవారం, హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తితో కలిసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తున్నందున రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తు ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు.గాలులకు టార్పాలిన్ కవర్లు ఎగిరి పోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు తెలియజేయాలన్నారు.కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, షామియానా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తేమ యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు.ఎక్కడ కూడా జాప్యం చేయకూడదన్నారు.హమాలీలు, వాహనాల కొరత రాకుండా సర్దుబాటు చేసుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రాలకు గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. మే నెల చివరి కల్లా 80% ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేయాలన్నారు.ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. అన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్ లు సరిపడా ఉండేలా చూసుకోవాలని, అలాగే ఏ రోజుకు ఆరోజు ధాన్యం కొనుగోలు వివరాలను తెలియజేయాలని, ఓపీఎంఎస్ లో వెంటనే ధాన్యం కొనుగోళ్ల వివరాలను నమోదు చేసి, 24 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలని పౌరసరఫరాల డీఎం సీఎస్ కు తెలిపారు.అలాగే వాతావరణ పరిస్థితులను తెలుసుకొని, వర్ష సూచనలు ఉంటే, వెంటనే ఆ సమాచారాన్ని కేంద్ర నిర్వాహకులకు, రైతులకు తెలియజేయాలన్నారు.టోకెన్ పద్ధతి ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, లోడింగ్, రవాణా ఏక కాలంలో జరగాలన్నారు. సరిపడా హమాలీలను పెట్టుకోవాలని, రవాణా పరంగా ఇబ్బందులకు గురి చేస్తే తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారికి సూచించారు.ప్రతి రోజూ రైస్ మిల్లులను తనిఖీ చేయాలని, కొనుగోలు అయిన ధాన్యం త్వరగా దిగుమతి అయ్యేలా పర్యవేక్షించాలన్నారు.పంట నమోదు ప్రక్రియలో తప్పిదాలు చేసే ఏఈఓల మీద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ప్రతి కేంద్రానికి ఒక వాహనాన్ని కేటాయించడం జరిగిందని, ఇప్పటికీ ఆయా కేంద్రానికి వాహనం పెట్టని వారిపై చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారికి తెలిపారు.అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉంటూ యాసంగి ధాన్యం సాఫీగా కొనుగోలు అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో రంగా రావు, డీఆర్డీఓ నూరుద్దీన్, డీఏఓ అంబికా సోనీ, డీఎంఓ రామ కృష్ణ, డీడబ్ల్యూఓ కోదండరాములు, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీసీఎస్ఓ పావని, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# ప్రజావాణి అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**తెలుగు గళం న్యూస్ జనగామ మే04**

ప్రజావాణిలో వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా (151) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందించి, ప్రజల సమస్యలను వెంటనే





పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి అర్జీల పరిష్కారంలో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

**ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులలోని కొన్నింటి వివరాలు**

చీటకోడూరు గ్రామం, జనగామ మండలానికి చెందిన కె. గణేష్ యాదవ్, తాను బీసీ – డీ, యాదవ కులం పేదవాడు అని, తల్లిదండ్రులు కూలి పని చేస్తుంటారని, భూమి జాగా లేదు అని, ప్రైవేట్ లో చదివించే స్తోమత లేదని, బీసీ సంక్షేమ ఎంజేపీలో చదవాలనే కోరిక ఉందని, కావున సీటు ఇప్పించగలరని దరఖాస్తు చేసుకున్నారు.పటేల్ గూడెం గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన జే. సురేష్, తనకు ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం విద్యుత్ తీగల వల్ల ఆగిందని, దీంతో ఆర్థికంగా, ఇంట్లో సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసియున్నారు.సిరిసన్నగూడెం గ్రామం, పాలకుర్తి మండలానికి చెందిన ఎస్. కొమ్రమ్మ, తను నిరుపేద కుటుంబానికి చెందినదని.... తనకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించుట గురించి ఆర్జీ ద్వారా కోరారు. వెంకిర్యాల గ్రామం, జనగామ మండలానికి చెందిన మామిడి అంజయ్య, తనకు పెంకుటిల్లు ఉందని, కానీ అది కూలిపోతుందని, ఉండటానికి వీలు లేకుండా ఉందని, ప్రస్తుతం అద్దెకు ఉంటున్నారని, డబుల్ బెడ్ రూం ఇల్లు కొరకు వినతిపత్రం సమర్పించనైనది.చీటూరు గ్రామం, లింగాల ఘనపురం మండలానికి చెందిన గ్రామ పంచాయతీ సర్పంచి బర్ల గణేష్, గ్రామంలో గల ఎంపీపీఎస్ పాఠశాలకు అదనపు తరగతి గదులు, వంటశాల షెడ్ నిర్మాణాలకు మంజూరు కోరుతూ దరఖాస్తును సమర్పించారు.ఈ ప్రజావాణి అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. అన్ని శాఖల జిల్లా అధికారులు, వారి పరిధిలో ఉండే సిబ్బంది స్వీయ గణన నమోదును చేపట్టాలని తెలిపారు.ఈ ప్రజావాణిలో జెడ్పీ సిఈఓ రంగారావు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ మాత్రు నాయక్, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, డీడబ్ల్యూఓ కోదండరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెదబయలు మండలంలో విషాదం చెట్టు కూలి ఇద్దరు మహిళల మృతి



**పాడేరు,తెలుగు గళం :** పెదబయలు మండలంలో విషాద ఘటన చోటుచేసు కుంది భారీ వర్షాల కారణం గా చెట్టు కొమ్మలు విరిగి పడడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు .ఈ ఘటన మండలంలోని సంత వద్ద జరిగింది .ఈ రోజు పెద బయలు మండలం పాత ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో భారీ వృక్షం ఒక్కసారిగా కూలిపడింది ఆ సమయంలో అక్కడ ఉన్న ఇద్దరు మహిళలపై చెట్టు కొమ్మలు పడటంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు . వీరిది ఒరిస్సా రాష్ట్రం గా గుర్తించారు.సమాచారం అందుకున్న స్థానికులు అధికారులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# మంత్రి లోకేష్ తో ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు మర్యాదపూర్వక భేటీ



**ఉండవల్లి తెలుగు గళం, మే 4 :** ఏపీ యోగా, నేచురోపతి విభాగం సలహాదారు, ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు మంతెన సత్యనారాయణ రాజు సోమవారం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల కేబినెట్ హోదాలో గౌరవ సలహాదారుగా ఆయనను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా మంతెన సత్యనారాయణ రాజు సేవలను ఈ సందర్భంగా మంత్రి కొనియాడారు.

# లివర్ ఆరోగ్యంగా ఉండాలంటే వేయాల్సిన యోగాసనాలు ఇవి.. ఎంతో ఫలితాన్నిస్తాయి

**హెల్త్ న్యూస్, 04 మే (తెలుగు గళం ):** ఆధునిక జీవనశైలిలో కాలుష్యం, అసమయ భోజనం, కూర్చుని పనులు చేయడం వల్ల కాలేయం (లివర్) ఆరోగ్యం దెబ్బతింటోంది. సాధారణంగా లివర్ ఆరోగ్యం గురించి మాట్లాడినప్పుడు ఆహారంపై ఎక్కువ దృష్టి పెడతారు. అయితే నిత్య జీవితంలో చేసే చిన్న వ్యాయామం కూడా లివర్‌ను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. లివర్ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవాలలో ఒకటి. ఇది విషపదార్థాలను తొలగించడం, పోషకాలను ప్రాసెస్ చేయడం, మెటబాలిజాన్ని నియంత్రించడం, జీర్ణక్రియకు సహాయం చేయడం వంటి అనేక పనులు చేస్తుంది. కానీ ఎక్కువసేపు కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక కేలరీల ఆహారం తీసుకోవడం వల్ల నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు యువతలో కూడా పెరుగుతున్నాయి.

వారానికి 150 నుంచి 200 నిమిషాలు..

నిపుణుల ప్రకారం, వారానికి కనీసం 150–200 నిమిషాల మోస్తరు వ్యాయామం చేయడం లివర్ ఆరోగ్యానికి అవసరం. అయితే గంటల పాటు జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ కేవలం 5–10 నిమిషాల చిన్న వ్యాయామం కూడా మంచి ఫలితాలు ఇస్తుంది. ఈ క్రమంలో సులభంగా



చేయగల చిన్న వ్యాయామాల రొటీన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మొదటగా 2–3 నిమిషాల పాటు వేగంగా నడవడం (బ్రిస్క్ వాకింగ్) చేయాలి. ఇది రక్తప్రసరణను మెరుగుపరచి మెటబాలిజాన్ని ప్రారంభిస్తుంది. దీని వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం తగ్గుతుంది. తర్వాత 1–2 నిమిషాల పాటు కపాలభాతి ప్రాణాయామం చేయాలి. వేగంగా శ్వాసను బయటకు వదిలే ఈ శ్వాస వ్యాయామం పొట్టలోని అవయవాలను ఉత్తేజపరుస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగవడం, డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు సహాయం జరుగుతుంది. అయితే హై బీపీ వంటి సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకుని మాత్రమే చేయాలి.

భుజంగాసనం..

అనంతరం భుజంగాసనం చేయడం మంచిది. పొట్టపై పడుకుని పై భాగాన్ని పైకి ఎత్తే ఈ యోగాసనం లివర్ ప్రాంతానికి రక్తప్రసరణను పెంచుతుంది. అలాగే పవనముక్తాసనం చేయడం ద్వారా జీర్ణక్రియ మెరుగవుతుంది, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. ఇవి పరోక్షంగా లివర్ ఆరోగ్యానికి సహాయపడతాయి. ఈ చిన్న వ్యాయామాల వల్ల శరీరంలో ఇన్సులిన్ స్పందన మెరుగవుతుంది, కొవ్వు నిల్వ తగ్గుతుంది, రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. ఇవన్నీ లివర్ సంబంధిత వ్యాధులను నివారించడంలో కీలకమైన అంశాలు.

నిరంతరత ముఖ్యం..

ముఖ్యమైన విషయం తీవ్రత కాదు, నిరంతరత. రోజూ కొద్దిసేపు చేసే వ్యాయామం, వారానికి ఒకసారి చేసిన కఠిన వ్యాయామం కంటే ఎక్కువ ప్రయోజనం ఇస్తుంది. క్రమంగా చేయడం ద్వారా మాత్రమే దీని ఫలితాలు కనిపిస్తాయి. ఇక ఈ వ్యాయామాలతోపాటు కొన్ని చిన్న అలవాట్లు పాటించడం కూడా అవసరం. తగినంత నీరు తాగడం, ఫైబర్, ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకోవడం, ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించడం, సరిపడా నిద్ర పొందడం వంటి విషయాలు లివర్ ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయి. లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం పెద్ద మార్పులు అవసరం లేదు. ప్రతిరోజూ కొన్ని నిమిషాల వ్యాయామం, జాగ్రత్తతో ఆహారం తీసుకోవడం వంటి ఈ చిన్న మార్పులే పెద్ద ఫలితాలను ఇస్తాయి. లక్షణాలు కనిపించే వరకు వేచి ఉండకుండా ముందు నుంచే చర్యలు తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఐపీఎల్ ఆటగాళ్ల 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్'పై బీసీసీఐ సీరియస్.. హార్దిక్, యశస్వి, ఇషాన్, అర్ష్‌దీప్‌లకు బిగ్ షాక్!



**స్పోర్ట్స్ న్యూస్, 04 మే (తెలుగు గళం ):** ఐపీఎల్ 2026 సీజన్ ఆసక్తికరంగా సాగుతున్న వేళ, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఓ కీలక అంశంపై సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా లీగ్‌లో కనిపిస్తున్న "గర్ల్‌ఫ్రెండ్ కల్చర్" పట్ల బోర్డు తీవ్ర అసహనంతో ఉందట. హార్దిక్ పాండ్యా, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్ వంటి స్టార్ ఆటగాళ్లు తమ గర్ల్‌ఫ్రెండ్స్‌తో కలిసి బహిరంగంగా కనిపిస్తుండటం, టీమ్ బస్సుల్లో వారితో కలిసి ప్రయాణించడం, హోటళ్లలో బస చేయడం వంటి అంశాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న బీసీసీఐ, దీనిని అడ్డుకోవడానికి కొత్త నిబంధనలు రూపొందించే పనిలో పడింది. ముఖ్యంగా, ఆటగాళ్లతో ఉండే ఈ భాగస్వాములలో చాలామంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కావడం బోర్డు ఆందోళనకు ప్రధాన కారణం. గతంలో వీరిలో కొందరు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సందర్భాలు ఉన్నాయని, వీరి వల్ల జట్టుకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారం బయటకు పొక్కే ప్రమాదం ఉందని బీసీసీఐ భయపడుతోందట.

ఈ కల్చర్ గేమ్ సమగ్రతను దెబ్బతీస్తుందని బోర్డు భావిస్తోంది. అంతేకాకుండా, గతంలో కొంతమంది ఆటగాళ్లకు, వారి మహిళా స్నేహితులకు మధ్య వివాదాలు తలెత్తి పోలీసు ఫిర్యాదుల వరకు వెళ్లడం లీగ్ ప్రతిష్టను, బోర్డు గౌరవాన్ని మసకబార్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో నిబంధనలను కఠినతరం చేయడం తప్పనిసరని బోర్డు నిర్ణయించుకుంది. ఓ ఉన్నత స్థాయి బీసీసీఐ అధికారి ఈ విషయంపై స్పందిస్తూ, ఆటగాళ్ల గర్ల్‌ఫ్రెండ్స్ కోసం టీమ్ బస్సులను ఆపుతున్నారని.. ప్లేయర్స్‌తో పాటే హోటళ్లలో బస చేయడం సరికాదని మండిపడ్డారు. అసలు "అధికారిక గర్ల్‌ఫ్రెండ్" అనే నిబంధన బీసీసీఐ పాలసీలో ఎక్కడా లేదని, కేవలం భార్యలు, కుటుంబ సభ్యులకు మాత్రమే నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. యాంటీ కరప్షన్ యూనిట్ అధికారులు సైతం కొందరు మహిళలను "అఫీషియల్ పార్ట్‌నర్స్" అని చెప్పగానే ఆటగాళ్లతో ఉండేందుకు ఎలా అనుమతించారనే కోణంలో విచారణ చేపట్టనున్నారని తెలిపారు. ఇక, త్వరలో జరగబోయే సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రైవేట్ యాజమాన్యంలో ఉన్నప్పటికీ, ఈ నిబంధనను కేంద్ర నిబంధనగా మార్చి అన్ని జట్లకు వర్తింపజేయాలని బీసీసీఐ యోచిస్తోందట. కేవలం ఐపీఎల్‌లోనే కాకుండా, భారత జట్టు విదేశీ పర్యటనలకు వెళ్ళినప్పుడు సైతం ఈ రూల్స్ వర్తిస్తాయని.. ప్రయాణ, బస ప్రోటోకాల్స్‌కు సంబంధించి ఏసీయూ అధికారులకు సైతం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారట.

# హార్దిక్ పాండ్యా ఓ ప్లాస్టిక్ కెప్టెన్ !



**స్పోర్ట్స్ న్యూస్, 04 మే (తెలుగు గళం ):** ఐపీఎల్ 2026 లో ముంబై ఇండియన్స్ చెత్త ప్రదర్శన కనబరుస్తోంది. కేకేఆర్, గుజరాత్ టైటాన్స్ పైన తప్ప మిగిలిన ఏడు మ్యాచ్ లలో చిత్తుగా ఓడిపోయింది ముంబై ఇండియన్స్. దీంతో పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ ప్లే ఆఫ్స్ చేరడం కష్టమే అంటున్నారు. అయితే ముంబై ఇండియన్స్ ఈ పరిస్థితిని ఎదుర్కోవడం వెనక హార్దిక్ పాండ్యా చెత్త కెప్టెన్సీ ఉందని తాజాగా కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రస్థాయిలో సీరియస్ అయ్యారు.

హార్దిక్ పాండ్యా ఓ ప్లాస్టిక్ కెప్టెన్ అని మండిపడ్డారు. అతడి చెత్త నిర్ణయాల కారణంగా ముంబై ఇండియన్స్ ఈ పరిస్థితిలో ఉందని విమర్శలు చేశారు. కెప్టెన్సీ ఉన్న నేపథ్యంలో తీవ్ర ఒత్తిడిలోకి పాండ్యా వెళ్తున్నాడని పేర్కొన్నారు. అయితే కెప్టెన్సీ నుంచి తప్పిస్తే, హార్దిక్ పాండ్యా చాలా ఫ్రీగా, భయంకరంగా ఆడతాడని సూచనలు చేశారు. అతనికి కెప్టెన్సీ పనికిరాదని కూడా వ్యాఖ్యానించారని తెలుస్తోంది. ఇప్పటికైనా ముంబై ఇండియన్స్ దీనిపై ఆలోచన చేయాలని కోరారు. అటు రోహిత్ శర్మను వెంటనే జట్టులోకి తీసుకురావాలని పేర్కొన్నారు కృష్ణమాచారి శ్రీకాంత్.

# పెద్ది ట్రైలర్ డేట్ లాక్




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. ఏ.ఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ మెరువనున్నారు. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు ఫినిష్ అయింది. ప్రస్తుతం ఐటెమ్ సాంగ్ షూటింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ నేపథ్యంలో ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది.

ఈ నెల 17 లేదా 18 తేదీన పెద్ది సినిమా ట్రైలర్ రిలీజ్ చేసేందుకు చిత్ర బృందం నిర్ణయం తీసుకుందట. ఈ ట్రైలర్ రిలీజ్ చేసిన తర్వాత దేశ వ్యాప్తంగా సినిమాను ప్రమోట్ చేయాలని డిసైడ్ అయ్యారట. ఈ మేరకు కసరత్తులు మొదలు అయినట్లు తెలుస్తోంది. కాగా బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న ఈ పెద్ది సినిమా జూన్ 4వ తేదీన థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ మేరకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.



# కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదు

మిల్క్ బ్యూటీ తమన్నా తన పర్సనల్ లైఫ్, ప్రేమ వ్యవహారాలపై చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఒకసారి ప్రేమలో విఫలం అయినా అటు వైపుమళ్లీ వెళ్లాలి అనుకోవడం లేదు అని అంటుంటారు. కానీ తమన్నా ఆలోచనలు దానికి భిన్నంగా ఉన్నాయి. విజయ్ వర్మతో ప్రేమ, బ్రేకప్ అనంతరం మళ్లీ కెరీర్‌పై ఫోసక్ పెట్టి వరుస సినిమాలు చేస్తుంది. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. ప్రేమ ఒక్కరితోనే ఆగిపోవాల్సిన అవసరం లేదంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. 'జీవితంలో ఎన్నిసార్లు అయినా ప్రేమలో పడే అవకాశం ఉంటుంది. అది కేవలం ఒక్క వ్యక్తికే పరిమితం కావాల్సిన అవసరం లేదు. మనసుకు నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పు లేదు. ఎందుకంటే బంధాలు అనేవి మనల్ని ఒకచోట కట్టిపడేసేవిగా లేదా మన స్వేచ్ఛను హరించేవిగా ఉండకూడదు. భాగస్వామితో ఉండే బంధం మన ఎదుగుదలకు తోడ్పడేలా, ఒకరినొకరు ప్రోత్సహించుకునేలా ఉండాలి. అలాంటి ఆరోగ్యకరమైన బంధం దొరికే అన్వేషణ కొనసాగిస్తూనే ఉంటా' అంటూ తమన్నా చెప్పడం విశేషం.

# విశ్వంభర నుంచి తప్పుకున్న త్రిష

## క్లారిటీ ఇచ్చేసిన టీమ్




దక్షిణాది చిత్రపరిశ్రమలో దశాబ్దాలుగా తన గ్లామర్‌తో, నటనతో భాషతో సంబంధం లేకుండా ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న ఎవర్ గ్రీన్ త్రిష ఈ రోజు తన 43వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. నేడు తన పుట్టిన రోజు కావడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ అండ్ సెలబ్రిటీలు శుభకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే ఈ బ్యూటీ నటిస్తున్న సినిమాల నుంచి వరుస పోస్టర్‌లు రిలీజ్ చేశారు. ఇందులో భాంగంగా.. విశ్వంభర నుంచి అదిరిపోయే పోస్టర్ రిలీజ్ చేశారు.

'మా 'అవని'కి పుట్టినరోజు శుభాకాంక్షలు.. అందమైన త్రిష మీరు రావడంతో 'విశ్వంభర' మరింత ప్రత్యేకంగా మారింది. విశ్వానికి మించిన మెగా మాస్ త్వరలో థియేటర్లలోకి రాబోతున్నది' అని తెలిపారు. కాగా.. గత కొద్ది రోజులుగా త్రిష సినిమాలు ఇక చేయదు అని, విశ్వంభర నుంచి కూడా తప్పుకుందని వస్తున్న వార్తలతో ఈ పోస్టర్‌తో చెక్ పడినట్లు అయింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా, బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'. దాదాపు రూ. 250 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు కూడా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు.

# ఆ వ్యసనం నుంచి బయటపడ్డా



'స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య' అనేది ఆర్యోక్తి. ఈ నీతిని తూ.చ తప్పక పాటిస్తున్నది శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్. తనలోని లోపాలను సరిచేసుకునే క్రమంలో తాను పడిన కష్టాన్ని ఆమె స్వయంగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. 'మానసిక వేదన, శారీరక శ్రమ నుంచి బయట పడేందుకు ఒకానొక సందర్భంలో నేనూ మద్యాన్ని ఆశ్రయించాను. నిదానంగా అది వ్యసనంలా మారింది. చివరికి మద్యం సేవించకపోతే ఉండలేని స్థితికి వచ్చేశాను. ఇలాంటి పరిస్థితుల్లో.. మెడిటేషన్ నా జీవితాన్ని మార్చింది. నిద్రలేవగానే శారీరకంగా, మానసికంగా విపరీతమైన అలసట. బలహీనపడుతున్న మానసిక దృఢత్వం.. ఇవన్నీ నాకు అర్థమవుతున్నాయి. చివరకు నా శరీరక స్పందనలు నాకే నచ్చడంలేదు. నాలో వస్తున్న మార్పులన్నీ నన్ను పునఃసమీక్షించుకునేలా చేశాయి. దాంతో ఇక తాగకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం క్రమంగా కుదురుకున్నది. మానసిక ఉల్లాసానికి మద్యమే మందు కాదు. ఈ విషయం ప్రతిఒక్కరూ గ్రహించాలి' అన్నారు జాన్వీకపూర్.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.